క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



శాంతినగర్ : వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల, తనగల గ్రామాల్లో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే విజయుడు శనివారం పరామర్శించారు. మండల పరిధిలోని కొంకలలో సుభద్రమ్మ, నాగేష్‌లు మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఇరువురి భౌతికకాయాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా తనగలకు చెందిన గాండ్ల వీరయ్యను పరామర్శించారు. తన వంతు సహాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా చైర్మన్ గోపాల్, తనగల రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏబీవీపీ పట్టణ కార్యదర్శిగా శ్రీధర్‌రెడ్డి



అయిజ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ ఆధ్వర్యంలో పట్టణ కార్యదర్శిని ఎన్నుకున్నారు. పట్టణంలోని అరోరా కళాశాలలో ఇంటర్ చదువుతున్న శ్రీధర్ రెడ్డిని కార్యదర్శిగా ప్రకటించారు. సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేస్తానని.. విద్యార్థుల భవిష్యత్తుకు కృషి చేస్తానని శ్రీధర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు లోకేష్, నరేష్, నిఖిల్, శేషావలి, శ్రీహరి, శ్రీనాథ్, వినీత్, ఉదయ్, రాఘవేంద్ర, విజయ్, అశోక్, వంశీ, బలరాం, సద్దాం, రహీం, నాని తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై కేసు నమోదు చేయాలి



అయిజ: మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్ రెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు మత్తాలి, మైబు, రాజు, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

మల్దకల్: 18ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జుబేర్‌మైనుద్దీన్ అన్నారు. శనివారం మండలంలోని అమరవాయిలో బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో చనిపోయిన వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించి.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

గద్వాల క్రైం: దేవాలయానికి వెళ్తున్న మహిళ మెడలో గుర్తు తెలియని దుండగులు బంగారు గొలుసు అపహరించిన సంఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. పాత హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శోభ దేవాలయానికి వెళ్తుండగా కాలనీ సమీపంలో మూల మలుపు వద్ద గుర్తు తెలియని దుండగులు బైక్‌పై వచ్చి మెడలోని మూడున్నర తులాల బంగారు గొలుసు (పుస్తెలతాడు) అపహరించారు. శోభ కేకలు వేయడంతో గమనించిన స్థానికులు పట్టుకునేందుకు ప్రయత్నం చేయగా నిందితులు పరారయ్యారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సుకుని విచారణ చేపట్టారు.

మూగ జీవాల అపహరణ..

వ్యవసాయ పొలంలో కట్టేసిన రెండు మూగ జీవాలను గుర్తు తెలియని దుండగులు అపహరించిన సంఘటన శనివారం జరిగింది. దౌదర్‌పల్లి కాలనీకి చెందిన రాజు శుక్రవారం తన రెండు ఎద్దులను కొండపల్లి రోడ్డు సమీపంలోని సొంత పొలంలో కట్టేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా ఎద్దులు కన్పించలేదు. దుండగులు మూగజీవాలను అపహరించినట్లు గుర్తించి పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. మూగజీవాల విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని బాధిత రైతుల తెలిపారు.

ప్రోత్సాహకాలు అందలే.. సమస్యలు తీరలే



పుటాన్‌దొడ్డిలో ఏకగ్రీవ సర్పంచ్‌కు 2019లో నియామకపత్రం అందిస్తున్న అధికారులు(ఫైల్)

- అభివృద్ధికి నోచుకోని ఏకగ్రీవ పంచాయతీలు
- పూర్తైన సర్పంచ్‌ల పదవీకాలం
- నియోజకవర్గంలో 13 ఏకగ్రీవ పంచాయతీలు
- ఆరేళ్లుగా నిధుల కోసం ఎదురు చూపులు

మండలాల వారీగా ఏకగ్రీవ గ్రామ పంచాయతీలు..

మండలం	జీపీలు	ఏకగ్రీవ పంచాయతీలు
ఇటిక్యాల	29	పుటాన్‌దొడ్డి, తిమ్మాపురం, నక్కలపల్లి
మానవపాడు	16	కలుకుంట్ల
వడ్డేపల్లి	10	తిమ్మాజిపల్లి, వెంకట్రామనగర్,
రాజోళి	11	పడమటి గార్లపాడు
ఉండవెల్లి	16	భైరాపురం
అలంపూర్	14	ఏకగ్రీవం కాలేదు
అయిజ	28	కురవపల్లి, గుడిదొడ్డి, కిష్టాపురం, నారోజీ క్యాంపు, కొత్తపల్లి

ఎర్రవల్లి: గ్రామ పంచాయతీలకు ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేసుకుంటే గ్రామాభివృద్ధికి తోడ్పాటును అందించడం సులభమవుతుందని ప్రభుత్వాలు భావించాయి. దీని కోసం ఎన్నికలు లేకుండా ఏకగ్రీవమయ్యే పంచాయతీలకు ప్రత్యేక ప్రోత్సాహక నిధులు అందించాలని 2001లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. 2019లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏకగ్రీవాల ప్రోత్సాహకాన్ని భారీగా పెంచింది. దీంతో గ్రామస్తులంతా ఏకమై పలు పంచాయతీలను ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేశారు. కానీ పదవీ కాలం పూర్తైనా నేటి వరకు ప్రోత్సాహక నిధులు మంజూరు కాకపోవడంతో గ్రామాల్లో సమస్యలు తీరలేదం లేదని ఏకగ్రీవాలైన మాజీ సర్పంచ్‌లు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థలు ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఏకగ్రీవ పంచాయతీ విధానంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. అభివృద్ధి జరుగుతుంది అనుకుంటే పట్టించుకునే నాథుడే లేడని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఏకగ్రీవ పంచాయతీలకు నిర్ణీత సమయంలో నిధులు కేటాయించి గ్రామాలు అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

13 ఏకగ్రీవ పంచాయతీలు..

అలంపూర్ నియోజకవర్గంలో 7 మండలాల్లోని 124 గ్రామ పంచాయతీల్లో 13 పంచాయతీలు 2019లో ఏకగ్రీవమయ్యాయి. సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే రూ. 15 లక్షల నజరానా ఇస్తామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికలకు ముందు ప్రకటించింది. దీని ద్వారా 13 పంచాయతీలకు రూ.1.95 కోట్లను ప్రభుత్వం జమ చేయాల్సి ఉంది. గతంలో రూ.7 లక్షలున్న ప్రోత్సాహకాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2019 ఎన్నికల సందర్భంగా రూ.10 లక్షలకు పెంచింది. దీనికి అదనంగా ఎమ్మెల్యే నిధుల నుంచి కూడా రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.15 లక్షలు ఇస్తామని ప్రకటించింది.

నిధులు రాక తీవ్ర ఇబ్బందులు..



ప్రత్యేక ప్రోత్సాహక నిధుల కోసం గ్రామస్తులమంతా ఏకమై పంచాయతీకి ఎన్నికలు లేకుండానే ఏకగ్రీవం చేసుకున్నాం. కానీ గ్రామంలో అదనంగా పలు అభివృద్ధి పనులు చేపడదామంటే ప్రోత్సాహక నిధులు మంజూరు కాలేదు. దీనివల్ల గ్రామ ప్రజల నుంచి చాలా ఇబ్బందులు పడ్డాం. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ప్రోత్సాహక నిధులు వెంటనే మంజూరు చేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.

– స్వాతి, మాజీ సర్పంచ్, పుటాన్‌దొడ్డి

ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి..



గ్రామ అభివృద్ధి కోసం పంచాయతీకి ప్రోత్సాహక నిధుల కింద ప్రభుత్వం అందించే రూ.15 లక్షల నిధులు వస్తే గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టాలని ఐదేళ్లుగా ఎదురుచూశాం. మా పదవీ కాలం పూర్తైనా ప్రోత్సాహక నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం స్పందించి నిధులు వెంటనే మంజూరు చేస్తే పంచాయతీలో ప్రజల సమస్యలు తీరుతాయి.

– నాగేశ్వరి, మాజీ సర్పంచ్, తిమ్మాపురం

ప్రభుత్వానికి నివేదిక పంపించాం..



మండలంలో ఏకగ్రీవంగా ఎన్నికైన మూడు పంచాయతీల వివరాలు గతంలోనే ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నిధులు ఆయా పంచాయతీలకు మంజూరు కావాల్సి ఉంది. నిధులు విడుదలైతే ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు సమాచారం అందించి ఆయా పంచాయతీలకు ప్రోత్సాహక నిధులను జమ చేస్తాం.

– అజార్ మొహియుద్దీన్, ఎంపీడీఓ, ఇటిక్యాల

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

గద్వాల అర్బన్: నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధికారి ప్రతినిధి సుభాన్, యూఎస్‌ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగస్వామి, బీఆర్‌ఎస్వీ నాయకుడు మాజీ డిమాండ్ చేశారు. రెండో శనివారం సెలవు దినం తరగతులు నడుపుతున్నా.. జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు పాఠశాలల వద్ద వారు నిరసన వ్యక్తం చేసి తరగతులు బంద్ చేయించారు. స్పెషల్ క్లాసుల పేరిట రెండో శనివారం, ఆదివారాల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆయా విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ నరసింహ

అయిజ: ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలని వడ్డెపల్లి ఎంఈఓ నరసింహ అన్నారు. కొన్ని సంవత్సరాలుగా మండలంలో ఇన్‌చార్జి ఎంఈఓగా పనిచేసిన నరసింహ ఇటీవల రిలీవ్ అయ్యారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాములు, వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు నరసింహను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాదాసి, మాదారి కురవగా నమోదు చేయించాలి



సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

శాంతినగర్: కులగణన సర్వేలో కురువ కులస్తులంతా మాదాసి, మాదారి కురువగా నమోదు చేయించుకోవాలని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పల్లయ్య సూచించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లో శనివారం సంఘ సమావేశం నిర్వహించారు. నడిగడ్డ ప్రాంతంలో కురువ కులం వారికి బీసీ పేరు మీద చాలా ఏళ్ల నుంచి తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చి చాలా కాలం నుంచి తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్యుమరేటర్లు కూడా కులం కాలంలో సీరియల్ నంబర్ 030గా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పెద్ద సోమన్న, అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు మల్లికార్జున్, ఠాగూర్ కృష్ణ, సంకపురం రాముడు, పులికల్ గోవర్దన్, వెంకట్రాముడు, చంద్రన్న, తిక్కయ్యలు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

మానవపాడు: మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో ఆదివారం నుంచి సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అధికారులు తనిఖీలు చేస్తారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ఎర్రవల్లి: 44వ జాతీయ రహదారిపై బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాలు.. కర్నూల్ పట్టణానికి చెందిన చాకలి కిశోర్ కుమార్ (25) కొంత కాలంగా రంగాపూర్ సమీపంలోని ఏబీడీ కంపెనీలో పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి డ్యూటీ ముగించుకుని బైక్‌పై కర్నూల్‌కు వెళ్తుండగా.. మునుగాల శివారులో జాతీయ రహదారిపై గుర్తు తెలియని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం



హారిక(ఫైల్)

ఉండవెల్లి: మండలంలోని బొంకూరు గ్రామానికి చెందిన హారిక అలియాస్ ఇందుమతి(42) అనే వివాహిత శుక్రవారం అదృశ్యమైన సంఘటన విదితమే. ఈ నేపథ్యంలో తుంగభద్ర నదిలో మహిళ దూకినట్లు సమాచారంతో గజ ఈతగాళ్లు గాలించగా శనివారం మహిళ మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ మహేష్ పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. హారిక అని గుర్తించడంతో పోస్టుమార్టం అనంతరం హారిక మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధరూరు: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ అనిల్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ధరూరు, జాంపల్లి, బూరెడ్డిపల్లి, దోర్నాల, కాపులకుంట, చిన్నపాడు, సోంపురం తదిరత గ్రామాల్లో విద్యుత్ కోత ఉంటున్నట్లు పేర్కొన్నారు. 33 కేవీ లైన్‌లో చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేయనున్నట్లు, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ధరూరులో బైక్ చోరీ

ధరూరు: ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ శుక్రవారం రాత్రి అపహరణకు గురైన సంఘటన ధరూర్‌లో చోటు చేసుకుంది. ధరూరు ఎస్సీ కాలనీలో సురేష్ తన పల్సర్ బైక్ గత రాత్రి ఇంటి ముందు పార్క్ చేశాడు. ఉదయం చూడగా గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను అపహరించినట్లు తెలిపారు. ఎంత వెతికినా ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు

వనపర్తి రూరల్: మండలంలోని మర్రికుంట సమీపంలో బహిరంగ ప్రదేశంలో కొందరు యువకులు మద్యం తాగి అల్లరి చేస్తుండడంతో వారిపై శనివారం కేసు నమోదు చేశామని ఎస్ఐ జలంధర్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండలంలోని మర్రికుంట గ్రామ శివారులో కొందరు వ్యక్తులు మద్యం తాగి అల్లరి చేయడంతో స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకొని మద్యం తాగిన వ్యక్తులను అదుపులోకి తీసుకొని ఓపెన్ బూజింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగరాదని, అలాగే చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

కులగణనతో అన్ని వర్గాల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: కులగణనతో రాజకీయ, ఆర్థిక, విద్యా పరంగా అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తుందన్నారు. కొందరు ప్రతిపక్ష నాయకులు ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ పార్టీపై బురద జల్లె ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎలాంటి అవకతవకలు జరుగకుండా న్యాయబద్ధంగా కులగణన జరుగుతుందన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ మహిళా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. గద్వాల అభివృద్ధికి ఎంపీ మల్లురవి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, మధుసుధన్ బాబు, ఇసాక్, డీటీడీసీ నర్సింహ్మా, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మమ్మ అవ్వ జాతర

ధరూరు: మండల పరిధిలోని గుర్రోనిపల్లి గ్రామంలో లక్ష్మమ్మ అవ్వ జాతర ఘనంగా నిర్వహించారు. జాతరలో జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ సరితమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు ఆమెను ఘనంగా శాలువా, పూలమాలలతో సన్మానించారు. ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని.. ప్రతి ఒక్కరికి లక్ష్మమ్మ అవ్వ ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ధరూరు: మండల పరిధిలోని నెట్టెంపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ హనిమిరెడ్డి మాతృమూర్తి శారదమ్మ, మండల కేంద్రానికి చెందిన కుర్వ బుచ్చన్నలు మృతి చెందారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, నియోజకవర్గ ఇన్‌చార్జి సరితమ్మ వారి భౌతికదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డీఆర్ శ్రీధర్, కుర్వ శ్రీనివాసులు, కపత్రాల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


17 నుంచి బూత్ కమిటీ ఎన్నికలు

గద్వాలటౌన్ : ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బీజేపీ బూత్ కమిటీల ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పార్టీ ఎన్నికల అధికారి విద్యాసాగర్ అన్నారు. శనివారం స్థానిక డీకే బంగ్లాలో జరిగిన పార్టీ సంస్థాగత ఎన్నికల కార్యాలయంలో ఆయన పాల్గొన్నారు. వంద సభ్యత్వాల పైబడి జరిగిన బూత్‌లోనే ఎన్నికలు జరుగుతాయన్నారు. 50 సభ్యత్వాలు చేసిన మహిళలు క్రియాశీల సభ్యత్వానికి అర్హులన్నారు. పార్టీ పదవులు రావాలంటే క్రియాశీల సభ్యత్వం తప్పనిసరి అన్నారు. బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, బాల్‌రెడ్డి, శివారెడ్డి, రామచంద్రారెడ్డి, బండల వెంకట్రాములు, కేకేరెడ్డి, దేవదాసు, రాజశేఖరశర్మ, నాగేశ్వర్ రెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలని వినతి

రాజోళి: మండలంలో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలని మాన్‌దొడ్డి గ్రామస్తులు శనివారం ఎమ్మెల్యే విజేయుడుకు వినతిపత్రం అందజేశారు. మండలంలో కళాశాల లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. మండలంలో కాలేజీ ఏర్పాటు చేస్తే పది గ్రామాలకు పైగా విద్యార్థులకు ఉన్నత విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సమగ్ర సర్వే



ఈసర్లపాడులో సర్వేలో పాల్గొన్న అధికారులు

ఇటిక్యాల: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఎన్యుమరేటర్లు ఎలాంటి తప్పులు లేకుండా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి శ్యాంసుందర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని నక్కలపల్లి, కొత్తదేవరపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను డీపీఓ తనిఖీ చేశారు. అనంతరం ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, ఎన్యుమరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని ఈసర్లపాడు, నందిన్నె, పాతపాలెం, వివిధ గ్రామాల్లో చేపట్టిన సర్వేను ఎంపీడీఓ కృష్ణమోహన్ శనివారం పరిశీలించారు. ఈ సందదర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో ఎన్యుమరేటర్లు తప్పులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఎన్యుమనేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: అలంపూర్ మండల పరిధిలోని ర్యాలంపాడ్‌లో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను శనివారం ఎంపీడీఓ పద్మావతి పరిశీలించారు. సర్వే ఫామ్స్ 47 మంది ఎన్యుమనేటర్లకు అందజేసినట్లు.. 5 మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని అమరవాయి, ఏ.బుడ్డిపాడు గ్రామాల్లో శనివారం ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: రాజోళిలో సమగ్ర కుటుంబ సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్ ఆధ్వర్యంలో ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి వివరాలు నమోదు చేస్తున్నారు. ఉపాధి ఆర్థిక, విద్యా తదిదర అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు.

అయిజ: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మున్సిపాలిటీ, మండలంలోని వివిధ గ్రామాల్లో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు. సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

ఎర్రవల్లి: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఎన్యుమరేటర్లు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి పార్ట్-1లో యజమాని వివరాలతో పాటు పార్ట్-2లో కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు, వారి వార్షిక ఆదాయం, తదితర వివరాలు నమోదు చేశారు. ఆయా గ్రామాల్లో ఎన్యుమరేటర్లు చేస్తున్న సర్వేను ప్రత్యేక అధికారులు పరిశీలించారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. గత మూడు రోజులుగా గడపగడపకు వెళ్లి స్టిక్కర్లు అతికించారు. రోజుకు 50 నుంచి 60 కుటుంబాల కంటే ఎక్కువ సర్వే చేసే పరిస్థితి లేదని ఎన్యుమరేటర్లు పేర్కొన్నారు.

మల్దకల్: సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యుమరేటర్లు పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ కాంతమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రమైన మల్దకల్‌లో నిర్వహిస్తున్న సర్వే ఆమె పరిశీలించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్యుమరేటర్లు ఉదయం వేళల్లో ఇళ్లకు వెళ్లి సర్వే చేయాలన్నారు. అదే విధంగా సర్వేను తహసీల్దార్ జుబేర్‌మైనుద్దీన్, ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి, ఎంపీఓ రాజశేఖర్ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



మల్దకల్‌లో సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ కాంతమ్మ

గట్టు: సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ఎలాంటి పొరపాట్లు, వివాదాలకు అవకాశం లేకుండా సర్వే పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ సరితారాణి ఎన్యుమరేటర్లకు సూచించారు. గట్టులో నిర్వహించిన సర్వేను ఎంపీడీఓ చెన్నయ్య, ఏపీఓ స్వామి, ఆర్ఐ రాజులు పరిశీలించారు. సర్వే కోసం ఇంటి దగ్గరకు వచ్చే ఎన్యుమరేటర్లకు పూర్తి వివరాలు తెలియజేసి ప్రజలు సహకరించాలని తహసీల్దార్, ఎంపీడీఓలు విజ్ఞప్తి చేశారు.

ధరూరు: సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో మంజుల అన్నారు. శనివారం మండలంలోని ఓబులోనిపల్లి, ధరూరు గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆమె క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎక్కడా పొరపాట్లు లేకుండా సర్వే చేయాలన్నారు. తప్పులు దొర్లకుండా నిర్వహించాలన్నారు. సర్వేకు ప్రజలు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నక్కలపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో కుటుంబ సర్వే అధికారులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఎంపీడీఓ తిరుపతన్న, తహసీల్దార్ హరికృష్ణ ఆధ్వర్యంలో 56 ప్రశ్నలతో ఉపాధ్యాయులు వివరాలు నమోదు చేస్తున్నారు. కార్యక్రమంలో ఏపీఎం కోటేశ్వరి, ఉపాధ్యాయులు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



ధరూరులో సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీఓ మంజుల